క్లుప్తంగా

287 మందికి వైద్య సేవలు



సింగవరంలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: సింగవరంలో బుధవారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఎన్.రాజు 287 మందికి వైద్యసేవలు అందించారు. అవసరమైన వారికి వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు ఉచితంగా పంపిణీ చేశారు. అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లలకు ఆరోగ్య పరీక్షలు జరిపారు. గ్రామంలో ఇళ్ల వద్ద మంచపై ఉన్న రోగుల వద్దకు నేరుగా వెళ్లి సేవలు అందించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సౌజన్య, ఏఎన్ఎం అరుణ, ఆశావర్కర్లు దేవి, విజయ, స్వరాజ్యం పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరం



చదరంగం ఆడుతున్న విద్యార్థులు

సీతానగరం: స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా కొనసాగుతోంది. లైబ్రేరియన్ టి.అరుణ్ కుమార్ పర్యవేక్షణలో బుధవారం మంచి మనసు అనే కథను విద్యార్థులతో చదివించారు. చదవడం మాకిష్టంలో భాగంగా కథలు చదవడం, కథలు వినడం, పుస్తక సమీక్ష, వక్తృత్వ పోటీలు, డిక్టేషన్ నిర్వహిస్తున్నారు. చదరంగ పోటీలతో పాటు యోగా చేయిస్తున్నారు. మంగళవారం నిర్వహించిన వారాంతపు పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

ఘనంగా కట్లమ్మ తల్లి జాతర

బిక్కవోలు: పందలపాక గ్రామ దేవత కట్లమ్మ తల్లి జాతరను బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. గరగ నృత్యాలు, తీన్‌మార్ డప్పులతో గ్రామోత్సవం జరిపారు. అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారి తీర్థం గురువారం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు ఎమ్మెల్యే సూర్యనారాయణ రెడ్డి పర్యటన

రంగంపేట: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి కృతజ్ఞతా పర్యటన చేస్తారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు తెలిపారు. ఆయన బుధవారం మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఈ నెల 13న జరిగిన పోలింగ్‌లో పార్టీ విజయానికి పాటు పడిన పెద రాయవరం, కోటపాడు, వెంకటాపురం, సుభద్రంపేట, మర్రిపూడి, సింగంపల్లి, నల్లమిల్లి తదితర గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో ఆయా గ్రామాల్లో సమావేశమవుతారన్నారు. వారికి కృతజ్ఞతలు తెలియజేయడంతో పాటు పార్టీ విజయంపై సందేశం ఇస్తారన్నారు. ఆయా గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

నిఘాపై నిర్లక్ష్యం..

- నిరుపయోగంగా సీసీ కెమెరాలు
- పట్టించుకోని అధికారులు

సీతానగరం: శాంతి భద్రతల పరిరక్షణ, నేరస్తులను పట్టుకోవడంలో పోలీసులకు క్లోజ్డ్ సర్క్యూట్ కెమెరాలు (సీసీ కెమెరాలు) ఎంతో ఉపయోగపడతాయి. నేరస్తుల కదలికలను రికార్డు చేసి, కేసు దర్యాప్తులో కీలకంగా మారతాయి. ఎక్కడ ఏ నేరం జరిగినా పోలీసులు ముందుగా పరిశీలించేది వీటిలో రికార్డు అయిన దృశ్యాలనే. దొంగతనాలు, దోపిడీలు, హత్యలు, రోడ్డు ప్రమాదాలు తదితర ఘటనల్లో కేసు దర్యాప్తుకు ఎంతో సహకరిస్తాయి. అయితే ఇంతటి ప్రాముఖ్యత కలిగిన సీసీ కెమెరాల నిర్వహణ నియోజకవర్గంలో మూలన పడింది. పలు గ్రామాల కూడళ్లలో వీటిని ఏర్పాటు చేసినా వినియోగంలోకి తీసుకురాలేదు. దీంతో అలంకార ప్రాయంగానే మిగిలాయి.

గతంలో ఏర్పాటు

పోలీసు శాఖ ఆధ్వర్యాన మండలంలోని పలు గ్రామాల కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. దాదాపు నాలుగేళ్ల క్రితం ఈ పనులు జరిగాయి. ఇందుకోసం ప్రత్యేకంగా స్తంభాలు ఏర్పాటు చేసి, వాటికి ఈ కెమెరాలను అమర్చారు. వాటిని కనెక్షన్లు ఇచ్చినా ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి.

దాడుల నేపథ్యంలో..

గతంలో ఆలయాలపై జరిగిన వరుస దాడుల నేపథ్యంలో పోలీసు శాఖ ప్రోద్బలంతో ఆలయాలు, చర్చిలు, మసీదుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మండలంలోని సీతానగరం, రఘుదేవపురం, పురుషోత్తపట్నం, ముగ్గళ్ల వంటి పలు ప్రాంతాల్లో కూడా అమర్చారు. సీతానగరం బస్టాండ్ సెంటర్‌లో రొటేటెడ్ కెమెరాను ఏర్పాటు చేశారు. దీనిని డాక్టర్ దుర్గాప్రసాద్ సమకూర్చారు. ఈ బస్టాండ్ సెంటర్‌లో సీసీ కెమెరా ఎంతో అవసరం. ఆర్టీసీ బస్సులు, ఆటోలు ఎక్కడానికి అధిక సంఖ్యలో ప్రయాణికులు వస్తుంటారు. ఇక్కడ సినిమా థియేటర్ కూడా ఉంది. రాత్రి పది గంటలు దాటిన తర్వాత దుకాణాలు మూసివేయడంతో ఈ ప్రాంతం నిర్మానుష్యంగా మారుతుంది. కీలకమైన ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా వినియోగంలోకి రాలేదు.

నిరుపయోగంగా..

సీతానగరం నాలుగు బొమ్మల సెంటర్‌లో కొటేటెడ్ సీసీ కెమెరా ఏర్పాటు చేశారు. వ్యాపారాలతో ఈ సెంటర్ ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. ఇక్కడ ఏ సంఘటన జరిగినా దానిని రికార్డు చేసేందుకు సీసీ కెమెరా ఎంతో ఉపయోగపడుతుంది. కానీ ఇది పని చేయడం లేదు. ముగ్గళ్ల, రఘుదేవపురాలలో బిగించిన సీసీ కెమెరాది కూడా అదే పరిస్థితి. సీతానగరం మండలంలో 34, కోరుకొండ మండలంలో 44, రాజానగరం మండలంలో 137 ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటిలో కొన్ని సీసీ కెమెరాలు పని చేయడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సీసీ కెమెరాలు పని చేసే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



సీతానగరం బస్టాండ్ సెంటర్‌లో పనిచేయని సీసీ కెమెరా

వినియోగంలోకి తెస్తాం



సీతానగరం, ముగ్గళ్ల, రఘుదేవపురం తదితర గ్రామాల్లో రోడ్ల విస్తరణ పనుల కారణంగా సీసీ కెమెరాల కనెక్షన్లు తెగిపోయాయి. మండల గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలలో కొన్ని పనిచేస్తున్నాయి. పనిచేయని వాటిని గ్రామ సచివాలయ మహిళా పోలీసులతో పరిశీలింపజేసి, వాటిని వాడుకలోకి తీసుకువస్తాం. దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నాం.

– టి.రామకృష్ణ, ఎస్సై, సీతానగరం

లక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలు

పెదపూడి: పుట్టకొండ గ్రామంలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి వారి జయంతి ఉత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పీపీ అనంతాచార్యులు, ఈఓ సీహెచ్‌వీ రమణమూర్తి అధ్వర్యంలో వైభవంగా జరిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు పి.గోపాలాచార్యులు ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. పంచామృతాభిషేకాలు, కుంకుమ, తులసి పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీ నాయకులు తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

రేపటి నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

రంగంపేట: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతాయని మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన బుధవారం మాట్లాడుతూ మండలంలోని 242 మంది ఈ పరీక్షలకు హాజరుకానున్నారని, వీరిలో 175 మంది తెలుగు, 67 మంది ఇంగ్లిషు మీడియం విద్యార్థులు ఉన్నారన్నారు. సింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరీక్షల కేంద్రంగా నిర్ణయించి, అన్ని ఏర్పాట్లూ చేశామన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు.

తప్పక విజయం సాధిస్తా..

- వైఎస్సార్ సీపీ శ్రేణులకు భరోసాగా నిలుస్తా
- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులను సత్కరిస్తున్న పార్టీ నాయకులు, అభిమానులు

అనపర్తి: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజాతీర్పు వైఎస్సార్ సీపీ వైపే ఉందని, జూన్ 4న వెల్లడయ్యే ఫలితాల్లో మరోసారి తప్పక విజయం సాధిస్తానని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో అనపర్తి, కొప్పవరం, మహేంద్రవాడ తదితర గ్రామాలకు చెందిన వైఎస్సార్ సీపీ శ్రేణులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సార్వత్రిక పోలింగ్‌కు ఓటర్లు పోటెత్తడం పార్టీకి అనుకూలమని, బడుగు, బలహీన వర్గాలు ఫ్యాన్ గుర్తుకే మొగ్గు చూపారన్నారు. ఎన్నికల్లో సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు, ఎన్నికల్లో తన విజయాన్ని కాంక్షిస్తూ సైనికుల్లా పనిచేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు భరోసాగా నిలుస్తానన్నారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ ప్రాధాన్యం ఉంటుందన్నారు. పోలింగ్ రోజున ప్రతిపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తలు కవ్వింపు చర్యలను పాల్పడినా, ఎక్కడా ఆవేశపడకుండా గ్రామాల్లో ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయడంపై పార్టీ శ్రేణులకు అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి మాట్లాడుతూ ఓటింగ్ ప్రక్రియ కేవలం లాంఛనమేనని, ఎన్నికల్లో తప్పక విజయం సాధిస్తున్నామన్నారు. ఎన్నికల ప్రచారంలో తన వెన్నంటి నడిపించిన ప్రతి కార్యకర్తకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సందర్భంగా వైఎస్సార్ సీపీ సీటు డాక్టర్ సూర్యనారాయణరెడ్డికి రాదంటూ ప్రచారం చేసిన ప్రతిపక్ష పార్టీ నాయకుడికే సీటు లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. ప్రాణం పోయినా పార్టీ మారే ప్రసక్తే లేదంటూ డాంబికాలు పలికిన ప్రతిపక్ష నేత చివరి నిమిషంలో పార్టీ కండువా మార్చుకుని పోటీలో నిలబడడం తన పార్టీపై ఆయనకున్న నిబద్ధతకు నిదర్శనమన్నారు. పార్టీ మండల కన్వీనర్, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ జూన్ 4 వెలువడే ఫలితాల్లో రెండోసారి డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి విజయం సాధించడం ఖాయమని, విజయోత్సవ సంబరాలకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, సర్పంచ్ వారా కుమారి, ఉప సర్పంచ్ చిర్ల వీర్రాఘవరెడ్డి, ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ తదితరులు మాట్లాడారు. ఈ సమావేశంలో మండలంలోని కొప్పవరం, మహేంద్రవాడకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

పన్నుల వసూలు వేగవంతం చేయాలి



కరకుదురులో రికార్డులను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ

పెదపూడి: గ్రామ పంచాయతీల పరిధిలో పన్నులు వసూలును వేగవంతం చేయాలని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. కరకుదురు, పెదపూడి సచివాలయాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి పలు రికార్డులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో జరిగే పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు రికార్డులను అప్‌డేట్ చేయాలన్నారు. పారిశుధ్యం, సురక్షిత తాగునీరు, వీధి దీపాలు తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు మన్యం శ్రీనివాసు చౌదరి, బి.ప్రసన్నకుమార్, తరుణ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ



దుళ్లలో పోలేరమ్మ జాతర సందర్భంగా ఆలయం వద్ద కళాకారులు చేస్తున్న గరగ నృత్యం

- ఘనంగా గ్రామ దేవతల జాతరలు
- నిబంధనలకు అనుగుణంగా నిర్వహణ

కడియం: మండలంలోని పలు గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. ప్రతి ఏటా వైశాఖ మాసంలో గ్రామ దేవతల జాతర, తీర్థ మహోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. వీరవరం రోడ్డులోని వెదుళ్లమ్మ – దోసాలమ్మ, దామిరెడ్డిపల్లి పోలేరమ్మ, కడియపులంక పల్లాలమ్మ, దుళ్ల, మాధవరాయుడుపాలెం తదితర గ్రామాల్లోని పోలేరమ్మ ఉత్సవాలు వరుసగా జరుగుతున్నాయి. ప్రతి ఏటా గరగ నృత్యాల ప్రదర్శనతో పాటు పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు, బాణసంచా కాల్పుల మధ్య ఆర్భాటంగా జరిగేవి. అయితే ఈసారి సార్వత్రిక ఎన్నికల కారణంగా పోలీసుయాక్ట్ 30, 144 సెక్షన్‌లు అమలులో ఉన్నాయి. జూన్ 4వ తేదీ వరకూ ఈ నిబంధనలు కొనసాగనున్న నేపథ్యంలో ఉత్సవాలకు ముందస్తు అనుమతులు తీసుకోవాలని పోలీసు శాఖ తెలిపింది. దీంతో ఉత్సవాలు గరగ నృత్యాల ప్రదర్శనలకే పరిమితమయ్యాయి. పోలీసుల పర్యవేక్షణలో సంప్రదాయబద్ధంగా ఉత్సవాలను ఆయా ఆలయ కమిటీలు, గ్రామస్తుల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. రెండు రోజులుగా దుళ్ల పోలేరమ్మ జాతర మహోత్సవం ఘనంగా జరిగింది. సంప్రదాయబద్ధంగా ఏర్పాటు చేసిన గరగ నృత్యాలు ఆకట్టుకున్నాయి. పోలీసులు అనుమతించిన మేరకు నిర్ణీత సమయంలో ఉత్సవాలను ముగించారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం

- ఎస్పీ జగదీష్
- పుష్కరఘాట్‌లో మాబ్ హ్యాండ్లింగ్, మాక్‌డ్రిల్ నిర్వహణ



పుష్కరఘాట్ వద్ద మాబ్ హ్యాండ్లింగ్, మాక్‌డ్రిల్‌లో ఫైరింగ్ చేస్తున్న పోలీసు సిబ్బంది

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని ఎస్పీ పి.జగదీష్ హెచ్చరించారు. పోలీసు అధికారులు, సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ జిల్లాలో శాంతిభద్రతలను పర్యవేక్షించడమే ముఖ్యధ్యేయంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎస్.ఆర్.రాజశేఖర్‌రాజు, అడిషనల్ ఎస్పీ (ఏఆర్) ఎల్.చెంచిరెడ్డి, సౌత్‌జోన్ డీఎస్పీ ఎం అంబికాప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది, కేంద్ర సాయుధ బలగాలు సంయుక్తంగా స్థానిక పుష్కర్ ఘాట్ వద్ద 'మాబ్ హ్యాండ్లింగ్, మాక్ డ్రిల్' నిర్వహించారు. అనుకోకుండా ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు, హింసాత్మక చర్యలకు పాల్పడినా, ఎవరైనా అల్లర్లు సృష్టించినా ఎలా స్పందించాలో ప్రదర్శించారు. మాబ్‌ను కంట్రోల్ చేయడానికి మొదటగా వార్నింగ్ ఇవ్వడం, అది వినకపోతే మేజిస్ట్రేట్ అనుమతితో టియర్ గ్యాస్ ప్రయోగించడం, ఉద్రిక్త పరిస్థితుల్లో తనను తాను రక్షించుకుంటూ లాఠీచార్జి చేయడం, ఆ తర్వాత ఫైర్ ఇంజిన్లతో వాటర్ ప్రయోగించడం, ప్లాస్టిక్ బుల్లెట్ల ఫైరింగ్, అప్పటికి పరిస్థితి అదుపులోకి రాకుంటే ఫైరింగ్ వంటివి డెమో ద్వారా ప్రదర్శించి, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తి అయ్యేలా జిల్లా పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటున్నారని చెప్పారు. అడిషనల్ ఎస్పీలు, జోనల్ డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు



రాజానగరంలో బుధవారం మధ్యాహ్నం నిర్మానుష్యంగా ఉన్న జాతీయ రహదారి

- రుతుపవనాల కోసం ప్రజల ఎదురుచూపు
- పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో అవస్థలు
- మధ్యాహ్న సమయంలో నిర్మానుష్యంగా రోడ్లు



సూర్యారావుపేటలో జన సంచారం లేని రహదారి

రాజానగరం: వేసవి ఎండల తీవ్రత రోజు రోజుకూ పెరిగిపోతోంది. ఆకాశంలో అడపాదడపా కారుమబ్బులు వేస్తున్నా, వాటి ప్రభావం పెద్దగా ఉండడం లేదు. ఈ నేపథ్యంలో జనం ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. నెలాఖరు నాటికి నైరుతి రుతుపవనాలు వస్తాయనే కబురుతో వారి రాక కోసం ఎదురు చూస్తున్నారు. వేసవి అంటేనే ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అయితే ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ప్రక్రియ పూర్తయి, ఫలితాల కోసం ఎదురుచూస్తున్న రకరకాల ఊహాగానాలతో తలమునకలై ఉన్న జనావళికి వేసవి ఎండలు చుర్రుమంటున్నాయి.

ఎండలకు హడలిపోతున్న ప్రజలు

మండుతున్న ఎండల కారణంగా ఇంటి నుంచి బయటకు రావడానికి ప్రజలు హడలిపోతున్నారు. ముఖ్యంగా మధ్యాహ్న సమయలో రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. దాదాపు 40 డిగ్రీలు పైబడుతున్న ఉష్ణోగ్రతలు చినుకులు పడితేగానీ చల్లబడే పరిస్థితులు కానరావడం లేదు. ఈ నెల మొదటి వారంలో భారీగా వర్షం కురిసినా ఉష్ణోగ్రతలు ఏమాత్రం తగ్గలేదు. బుధవారం మధ్యాహ్నం 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదైంది. జాతీయ రహదారిపై ఆ సమయంలో కర్ఫ్యూ వాతావరణం కనిపించింది. ఆర్టీసీ బస్సులు మినహా లారీలు, ఆటోలు కూడా పెద్దగా తిరగలేదు. రాజానగరం, దివాన్ చెరువు, లాలాచెరువు కూడళ్లు జనసంచారం లేక నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి.

జాగ్రత్తలు అవసరం

ఉష్ణోగ్రతలు పెరిగిన నేపథ్యంలో వడగాల్పులు వీచే అవకాశం అధికంగానే ఉందని వైద్యులు చెబుతున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల సమయంలో బయట తిరగవద్దని హెచ్చరిస్తున్నారు. చమటలు పట్టి శరీరం డీహైడ్రేషన్‌కి గురికాకుండా తరచూ మంచినీరు, గ్లూకోజ్ వాటర్, బార్లీ నీరు తాగుతుండాలని సూచించారు. అలాగే నీరసమనిపిస్తే ఓఆర్ఎస్ తీసుకోవడం మంచిదన్నారు.

శీతల పానీయాలకు డిమాండ్

ఎండల తీవ్రతకు కొబ్బరి బొండాలతో పాటు జ్యూస్, కూల్ డ్రింక్స్‌కు మంచి డిమాండ్ ఏర్పడింది. గ్రామీణ ప్రాంతాలలో సైతం జ్యూస్, కూల్‌డ్రింక్స్ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. కూడళ్లలో కొబ్బరి బొండాలు అమ్మకాలు జరుగుతున్నాయి.

విజ్ఞానం.. వినోదం..

- ఆకట్టుకుంటున్న కాటన్ మ్యూజియం
- పెరుగుతున్న సందర్శకులు



ధవళేశ్వరంలోని కాటన్ మ్యూజియం



గోదావరి ప్రవాహాన్ని తెలిపే నమూనా చిత్రం



ఆనకట్ట నిర్మాణ పనులకు వినియోగించిన ఆవిరి యంత్రం

ధవళేశ్వరం: వేసవి సెలవులు అంటే చిన్నారులకు ఎంతో ఉత్సాహంగా ఉంటుంది. ఏడాది పాటు పాఠశాలల్లో చదువులతో కుస్తీలు పట్టిన వారందరికీ ఉపశమనం లభిస్తుంది. అమ్మమ్మ ఇంటికో, బంధువుల ఊళ్లకో, నచ్చిన ప్రదేశాలకు వెళ్లడానికి ఇష్టపడతారు. వారికి ఆటపాటలతో పాటు విజ్ఞానాన్ని కలిగించే విషయాలను తెలియజేయడానికి ఈ సెలవులు బాగా ఉపయోగపడతాయి. అలాంటి వాటిలో కాటన్ మ్యూజియం ముందు వరుసలో నిలుస్తుంది. కాటన్ బ్యారేజీ గురించి పుస్తకాలలో చదువుకున్న విద్యార్థులందరూ దాన్ని కళ్లారా చూడడం చాలా బాగుంటుంది. బ్యారేజీ కట్టే సమయానికి ఉన్న పరిస్థితులను కాటన్ మ్యూజియంలోని చిత్రాలలో చూడవచ్చు. ఆనాటి ఆనకట్ట నిర్మాణంలో వాడిన పరికరాలు కూడా కనిపిస్తాయి.

కాటన్ మ్యూజియం

వేసవి సెలవులను ప్రస్తుతం విద్యార్థులు బాగా ఎంజాయ్ చేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి బంధువులతో కలిసి ధవళేశ్వరంలోని కాటన్ మ్యూజియాన్ని సందర్శిస్తున్నారు. రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాలతో పాటు దూర ప్రాంతాల నుంచి తరలివస్తున్నారు. వేసవి సెలవుల నేపథ్యంలో కాటన్ మ్యూజియం సందర్శకులతో కిటకిటలాడుతోంది. గోదావరి సోయగాల నడుమ నిర్మించిన ఈ మ్యూజియం సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. కాటన్ దొర జీవిత విశేషాలతో పాటు గోదావరి పుట్టుక నుంచి సముద్రంలోకి కలిసే వరకూ ప్రవాహ తీరును ఇక్కడ చూడవచ్చు.

విజ్ఞాన వర ప్రదాయిని

కాటన్ మ్యూజియాన్ని విజ్ఞాన వరప్రదాయినిగా చెప్పవచ్చు. దీని ఆవరణలో గోదావరి పుట్టిన నాసిక్ నుంచి సముద్రంలో కలిసి పోయే వరకూ ప్రవాహ నమూనాను ఏర్పాటు చేశారు. గోదావరిలో ఉప నదులు ఎక్కడ కలుస్తాయి, నది పక్కనే ఉండే దేవాలయాలను కూడా దీనిలో చూడవచ్చు. మ్యూజియం లోపల డెల్టా నమూనాలతో పాటు కాటన్ జీవిత చరిత్రను సమగ్రంగా అందుబాటులో ఉంచారు.

ఫొటో గ్యాలరీ

ధవళేశ్వరంలో ఆనకట్ట నిర్మాణానికి ముందు ఈ ప్రాంత ప్రజలు పడిన ఇబ్బందులను కళ్లకు కట్టినట్టు చూపించే ఫొటోలతో గ్యాలరీ ఏర్పాటు చేశారు. 1986 వరదలలో ఈ ప్రాంత పరిస్థితిని వివరించే ఫొటోలు కూడా ఇక్కడ ఉన్నాయి. మ్యూజియానికి మరోవైపు ఆనకట్ట నిర్మాణ సమయంలో ఉపయోగించిన పరికరాలను ఉంచారు. వాటి పేర్లను, వాటిని అప్పట్లో దేని కోసం వినియోగించారో ఆ వివరాలను పొందుపరిచారు. మ్యూజియంలో ఏర్పాటు చేసిన పార్కు ఎంతో ఆహ్లాదం కలిగిస్తోంది.

ప్రవేశ రుసుం రూ.10

కాటన్ మ్యూజియం చూసేందుకు పిల్లలకు రూ.5, పెద్దలకు రూ.10 వసూలు చేస్తున్నారు. మ్యూజియం బయట పార్కు అందాలను బంధించేందుకు కెమెరాకు రూ.25 వసూలు చేస్తున్నారు. మ్యూజియం లోపల ఫొటోలు తీసేందుకు అధికారుల అనుమతి తీసుకోవాలి. ప్రతి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకూ తెరిచి ఉంచుతారు. ఏడాది పొడవునా మ్యూజియం తెరిచే ఉంటుంది.